క్లుప్తంగా

బాధితురాలికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కామవరపుకోట: నోటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కామవరపుకోటకు చెందిన బొల్లి బోయిన సుజాతకు వైద్య ఖర్చుల నిమిత్తం మండలవాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో రూ.13,200 ఆర్థిక సహాయాన్ని అందజేశారు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జయవరపు లక్ష్మణ వరప్రసాద్, సభ్యులు వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా తల్లాడి అశోక్, జనరల్ సెక్రటరీగా వీవీవీ భువనేశ్వరి, జాయింట్ సెక్రటరీగా తామా రఘు, లైబ్రెరీ సెక్రటరీగా విత్తనాల రత్నరాజు, ట్రెజరర్‌గా మాణికల సూరిబాబు, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.ప్రతాప్, మహిళా ప్రతినిధిగా బండారు లతాకుమారి విజయం సాధించినట్లు మాజీ అధ్యక్షులు మేకా ఈశ్వరయ్య తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేందుకు సహకరించిన బార్ సభ్యులకు ఈశ్వరయ్య ధన్యవాదాలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

బుట్టాయగూడెం : తణుకు మండలం ముద్దపురం జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ కోరారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కొదం ఆనంద్, మధు, బుడుపుల విజయరాజు, నున్నా సుబ్బారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టులోని నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రాజమండ్రికి చెందిన వెత్స శేఖర్‌రాజు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలసి ట్రస్టులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ట్రస్టు ఛైర్మన్ బొండాడ రామ్మోహన్‌రావు, అన్నదానం ఇన్‌చార్జి యిమ్మడి నాగులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాత దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని, విరాళం బాండ్ పత్రాన్ని అందజేసి సత్కరించారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంకు చెందిన పి.ప్రణయ్‌పై అతని కుటుంబ సభ్యులతో కొయ్యలగూడెంకు చెందిన పి.సుబ్రహ్మణ్యం చెడుగా చెప్పాడు. దీంతో సుబ్రహ్మణ్యంను ప్రణయ ప్రశ్నించగా జంగారెడ్డిగూడెం రామునికుంట చెరువు ప్రాంతంలో దాడికి పాల్పడడంతో పాటు కులం పేరుతో దూషించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన 14 మందిపై కేసు నమోదు

టి.నరసాపురం : అధికారుల విధులకు ఆటంకం కలిగించిన 14మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం గ్రామంలో మంగళవారం అటవీ భూమి సర్వే నిమిత్తం, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన గజ్జల ములకయ్య, మరో 13 మంది సమావేశ ప్రాంతానికి వచ్చి సర్వే నిర్వహించడానికి వీలు లేదంటూ అధికారులపై దౌర్జన్యం చేశారు. వారి విధులకు ఆటంకం కలిగించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కె.సతీష్‌కుమార్ 14మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత విద్యుత్ అమలు చేయాలని వినతి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన ప్రకారం మండలంలో బార్బర్ షాప్‌లకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయమని కోరుతూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు చెడే నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం కామవరపు కోట ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఏడీ కాసాని శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు మల్లవరపు నాగపాసి, సభ్యులు పాల్గొన్నారు.

ఆడపడుచుల అభ్యున్నతికి 'ఆసరా'

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బుట్టాయగూడెంలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా సుమారు రూ. 3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ లబ్ధి పొందారని అన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఇటువంటి పథకాలను ప్రవేశపెట్టారా అని బాలరాజు ప్రశ్నించారు. 2024లో అధికార పగ్గాలు చేపట్టాలని తాపత్రయ పడుతున్న చంద్రబాబు ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పగలరా అని సవాలు విసిరారు. చంద్రబాబు పాలనలో మహిళా సంఘాలకు ఇచ్చిన పథకాలను ఏ ఒక్కటైనా అమలు చేశారా అని అన్నారు. పసుపు కుంకుమల పేరుతో మహిళలను మోసం చేయాలని చూశారని అన్నారు. 2016లో ఆగిపోయిన సున్నా వడ్డీ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అమలు చేస్తోందని అన్నారు. కాగా బుట్టాయగూడెం మండలంలో 8,468 మంది వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు సుమారు రూ. 4 కోట్ల 47 లక్షల చెక్‌ను పంపిణీ చేశారు. ఆసరా పథకంలో సొమ్ములు అందుకున్న మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పాదయాత్రలో, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పథకాన్ని అమలు చేస్తూ ప్రతి ఏడాది ఆసరా పథకంలో సొమ్ములు వేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని మహిళలు అన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

ఇటీవల జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న సర్పంచ్ తెల్లం వెంకాయమ్మను వైఎస్సార్ ఆసరా చెక్‌ల సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. అలాగే కార్యక్రమంలో వెలుగు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేలను కొనడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీతి, నిజాయితీతో పాలన సాగిస్తున్నారని అన్నారు. చంద్రబాబు వెన్నుపోటు, కుట్రలు, దగాలు, మోసాలకు పేటెంట్‌గా ఉన్నారని అన్నారు. నిజాయితీతో గెలవడం చేతకాక ఓటుకు నోటు ఇచ్చే సంస్కృతిని చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని అన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ 23 మంది ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసి నీచ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. నాడు తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయారని విమర్శించారు. మళ్లీ అదే తరహాలో ఏపీలో కూడా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యేలకు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేశారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూసి వాపును బలుపుగా భావిస్తున్నారని వారికి ప్రజలు గుణపాఠం కచ్చితంగా చెబుతారని అన్నారు. రాష్ట్రంలోని రాజకీయాలను చంద్రబాబు భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, ఏపీడీ ఎం.నాగేశ్వరరావు, ఏపీఎం పద్మావతి, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ ఆసరా 3వ విడత పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం ఎస్.ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారన్నారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొంటారని చెప్పారు.

విర్డ్ ఆస్పత్రిలో ముగ్గురు ట్రస్టీల తొలగింపు

ద్వారకాతిరుమల: శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్డ్ (విర్డ్) ఆస్పత్రి ట్రస్ట్‌లో ముగ్గురు ట్రస్టీలను తొలగించారు. ట్రస్ట్ ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు అధ్యక్షతన ఈనెల 3న ఆస్పత్రిలో జరిగిన ట్రస్టుబోర్డు సమావేశంలో ఈమేరకు తీర్మానించారు. ఐఏఎస్‌లు అజయ్ కల్లాం, పి.సుందరకుమార్, డాక్టర్ గుడారు జగదీష్‌లను విర్డ్ ట్రస్ట్ నుంచి ట్రస్టీలుగా తొలగించారు. ట్రస్ట్ కార్యకలాపాలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోవడం, తగు శ్రద్ధను చూపకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారికి పంపిన లేఖలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు వారు ట్రస్టుకు అందించిన సేవలకు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

హాస్టల్ వార్డెన్‌ను నియమించాలి

బుట్టాయగూడెం : పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, రెగ్యులర్ హాస్టల్ వార్డెన్‌ను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఈ. భూషణం కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అక్కడ 220 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వసతిగృహంలో పలు సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని కొలువై ఉన్న శ్రీ సీతారామస్వామి (వైకుంఠ రాముడు) బ్రహ్మోత్సవాలను ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుజన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

ఎస్సై సుధీర్‌కు సత్కారం



ఎస్సై సుధీర్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌ను జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఏలూరు సబ్ డివిజన్‌లోని చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముద్దాయిలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 4 కేజీల 100 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరచిన గణపవరం, చేబ్రోలు ఎస్సైలతో పాటు ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్‌ను ఎస్పీ సత్కరించి, ప్రశంసా పత్రం, నగదు బహుమతిని అందించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



లింగపాలెంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

లింగపాలెం : మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం లింగపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తోందన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గతంలో రుణమాఫీగా రెండు విడుతలుగా అందించామని, మూడవ విడత సైతం పంపిణీ చేసినట్లు చెప్పారు. మహిళల జీవన ప్రమాణాలు మార్చడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆసరా పథకం ద్వారా లింగపాలెం మండలంలో 1,308 డ్వాక్రా సంఘాలకు రూ. 1377.37 లక్షలను వారి బ్యాంకు అకౌంట్‌లకు జమ చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వడ్లాని హరినాధరాజు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ ఛైర్మన్ దెయ్యాల నవీన్ బాబు, చింతలపూడి మార్కెట్ కమిటీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కె.ఝాన్సీ, లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత ముసునూరు వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొఠారి మోహన్‌రావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ ఛైర్మన్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా బోధన ప్రభుత్వ లక్ష్యం

చింతలపూడి : విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి పేద బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి బాటలు వేశారని చెప్పారు. అనంతరం పాఠశాల చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, హైస్కూల్ హెచ్ఎం మాటూరి చక్రధర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేస్తే.. పరిష్కరిస్తా

చింతలపూడి : సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి మండల కార్యాలయాలకు వెళ్లకుండానే ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారని అన్నారు. గ్రామస్తులు ఏ చిన్న సమస్య అయినా వలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, కొప్పుల నాగేశ్వరరావు, ఎస్.దుర్గారావు, కె.రామారావు, ఎం.ఇమ్మానియేలు, ఎస్.కాంతారావు, చందూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లేగదూడల సంరక్షణపై రైతులు దృష్టి పెట్టాలి



దర్భగూడెంలో లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో మంగళవారం పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 లేగదూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కార్యనిర్వాహణ అధికారి పశుకేంద్రం ఈఓ జేసురత్నం లేగదూడల సంరక్షణపై రైతులకు అవగాహన కలిగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు మాట్లాడుతూ పాడిరైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని చెప్పారు. సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయి బుచ్చారావు మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడ వచ్చినట్లయితే రైతులకు లాభసాటిగా ఉంటుందని చెప్పారు. అలాగే నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు కాబట్టి లేగదూడల సంరక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం ఈ ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి జె.లక్ష్మీప్రసన్న, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఎంపీటీసీ కె. సుధారాణి, ఉపసర్పంచ్ కె.రాఘవరెడ్డి, ఎంపీటీసీ సున్నం సురేష్, జేవీఓ ఎం.అమ్ములు, ఎల్ఎస్ఏ ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



104 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో నియోజకవర్గంలో మంజూరైన నూతన 104 వాహనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ అమలు చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. అనంతరం కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన నెలపోగుల కనకచంద్రం వైద్యం కోసం మంజూరైన రూ.6,40,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌ను ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వైద్యులు, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామయ్యపేట పునరావాస కేంద్రంలో గ్రామసభ



గ్రామసభ నిర్వహించిన డిప్యూటీ తహసిల్దార్ ఎస్.ప్రసాద్

పోలవరం రూరల్ : రామయ్యపేట పునరావాస కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ప్రసాద్ మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పునరావాస కేంద్రానికి మంజూరైన చర్చి నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయింపు, కమిటీ సభ్యుల ఆమోదం కోసం గ్రామసభ నిర్వహించారు. సభ్యుల ఆమోదంతో చర్చి నిర్మాణానికి గ్రామసభలో తీర్మానం చేశారు. ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం చర్చి నిర్మాణం పనులు చేపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని, డ్రెయిన్‌లు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువకులకు ప్యాకేజీ ఇచ్చిన వారికి ఇంటి స్థలం కేటాయించాలన్నారు. ఇంటి స్థలం పట్టాలు రిజిస్ట్రేషన్ కోసం అనుమతులు ఇవ్వాల్సిందిగా పేర్కొన్నారు. 3 రామాలయాలు, 2 ముత్యాలమ్మ ఆలయాల నిర్మాణం, ఒక చర్చి నిర్మాణానికి సంబంధించి రూ.33 లక్షల నిధుల మంజూరు కోసం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు.. ఎరువుల షాప్ సీజ్



మక్కినవారిగూడెంలో ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

టి.నరసాపురం : స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు, అక్రమ నిల్వలు కలిగి ఉన్న ఎరువుల షాపును విజిలెన్స్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. దీనికి సంబంధించి విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మక్కినవారిగూడెంలో దత్త సాయి ట్రేడర్స్ ఎరువులు, పురుగుమందుల షాపును మంగళవారం తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో షాపులో ఉన్న నిల్వలలకు, స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం గుర్తించామన్నారు. ఈ వ్యత్యాసం 107 టన్నులు ఉందని, వీటి విలువ రూ. 18.5లక్షలుగా ఉంటుందన్నారు. అలాగే లైసెన్స్ లేని గోడౌన్‌లో అక్రమంగా 11 టన్నుల ఎరువులను నిల్వ చేసినట్లు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.11 లక్షలు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గ్లెసైల్ కలుపుమందును అక్రమంగా అమ్ముతున్నట్లు గుర్తించి, రూ. 1.62లక్షలు విలువైన 195 లీటర్ల కలుపు మందును స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో పి.సురేష్, టి.నరసాపురం ఏవో బి.ముత్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కె.జగ్గవరం సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న ఛైర్మన్ వాసిరెడ్డి మధు

టి.నరసాపురం : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని మండలంలోని కె.జగ్గవరం సొసైటీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు అన్నారు. మంగళవారం కె.జగ్గవరం సొసైటీ ఆవరణలో సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో బందంచర్లలో ఎరువుల గోడౌన్, ఆర్ఓఆర్ ప్లాంట్‌ను, రాజుపోతేపల్లి అడ్డరోడ్డులో పెట్రోల్ బంక్ నిర్మించామన్నారు. అనంతరం మధుని, మాజీ సొసైటీ అధ్యక్షులు వెలిది కృష్ణమూర్తిని సొసైటీ సభ్యులు, రైతులు ఘనంగా సత్కరించారు. సీఈవో తనగాల వీరవెంకయ్య వార్షిక బడ్జెట్‌ను చదివి వినిపించారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్ వెంకటేశ్వరరావు, బందంచర్ల సర్పంచ్ వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది గంగాధరరావు పాల్గొన్నారు.

నేడు కుట్టుమెషీన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం : హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్నట్లు డైరెక్టర్ గెద్దం జాషువా తెలిపారు. స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 100 మంది మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ పాల్గొంటారని తెలిపారు.

బీసీల రిజర్వేషన్లకు చట్టం తీసుకురావాలి

కొయ్యలగూడెం: స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసన సభలో చట్టం తీసుకురావాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు 50 శాతం స్థానిక సంస్థల్లో పదవులు ఇచ్చినప్పటికీ అవి పార్టీ పరంగానే గాని చట్టపరంగా లేకపోవడం లోటుగా మిగిలిందన్నారు. జి.సోమేశ్వరరావు, ఎస్.గోపాలరాజు, సేశెట్టి శ్రీనివాసరావు, ముప్వ వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కొయ్యలగూడెం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ప్రచార యాత్రలో పిలుపునిచ్చారు. మంగళవారం కొయ్యలగూడెం విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార జీపు యాత్ర బయ్యనగూడెం, గవరవరం, కొయ్యలగూడెం, కన్నాపురంలలో సాగింది.

బుట్టాయగూడెం : సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల పిలుపుమేరకు ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుట్టాయగూడెంలో మంగళవారం ప్రచార జీప్ జాత నిర్వహించారు. నాయకులు ఎం.నాగమణి, బి. రాంబాబు, ఎస్‌కె. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

[illegible]

సత్తుపల్లి
ది. 28-03-2023